

అధికారులతో సమావేశమైన జడ్సీ అపూర్వ్ చౌహాన్

ఆరుబయట చెత్తవేస్తే రూ.50 వేల జరిమానా

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో రాజీ పడే ప్రసక్తే లేదని జడ్సీ అపూర్వ్‌చౌహాన్ పేర్కొన్నారు. ఈ మేరకు జోన్ పరిధిలోని పారిశుధ్య విభాగం అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా చూడాలని, ఎవరైనా ప్రైవేటు వ్యక్తుల భవనాల పక్కన చెత్తఉంటే వారినే బాధ్యుల్ని చేయాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆటోలు, ప్రైవేటు ఆటోవాలాలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే రూ.50 వేలు, వ్యక్తి చెత్త బయట పడేస్తే రూ.1000 చొప్పున జరిమానా వేసి వసూళ్లు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే వేసేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

స్విమ్మింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థి



తేజస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఒడిశా భువనేశ్వర్‌లో జరిగిన 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ నేషల్ అక్వాటిక్(ఈత) పోటీల్లో కూకట్‌పల్లి ఫిరోజ్‌గూడకు చెందిన తేజస్ కాంస్య పతకాలు సాధించాడు. ఈ మేరకు శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తేజస్‌ను అభినందించారు. తేజస్ 50, 100మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో రెండు కాంస్యపతకాలు, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లికిచెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారని,

శివకుమార్‌కు జ్యోతీరావు ఫూలే నేషనల్ ఫెలోషిప్

హైదర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ దళిత్ సాహిత్య అకాడమి న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మహాత్మాజ్యోతీరావు ఫూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు ప్రగతినగర్ జగద్గిరిగుట్టకు చెందిన రామోజు శివకుమార్ ఎంపికయ్యాడు. శివ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి సమాజానికి తనవంతు సేవలందించాలనే ఉద్దేశంతో 20 ఏళ్లుగా ప్రజా సమస్యపై పోరాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పురోగతికి పాటుపడుతున్నాడు. డిసెంబర్ 8, 9న నిర్వహించే జాతీయ సదస్సులో ఈ అవార్డు అందుకోనున్నారు.

జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వే పరిశీలన

చందానగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వేకు ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహశబరీష అన్నారు. చందానగర్ సర్కిల్ గౌతమినగర్‌లో నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎస్ సర్వేను ఇన్‌చార్జి ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వేద్వారా సేకరించిన సమాచారం కీలకమన్నారు. దీంతో భవనాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ మరమ్మతు పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి ఛత్రపతి శివాజీనగర్ వద్దమ్యాన్ హోల్ పొంగి మురుగు నీరు రోడ్డుమీదకు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఇక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి డివిజన్ 9 జెఎన్‌టీయూ జీఎం ప్రభాకర్‌రావు, డీజీఎం నాగప్రియ పరిశీలించారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సమస్య పెరగడంతో కార్పొరేటర్ రాత్రి అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి, అర్థరాత్రి చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో .జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ శ్రావణి. మేనేజర్ యూసఫ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

ఏఐవైఎంఎస్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా యశ్వంత్‌రాజ్



యశ్వంత్‌రాజ్‌యాదవ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ (ఏఐవైఎంఎస్) యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా గొర్ల యశ్వంత్‌రాజ్‌యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దు ల బాబురావు యాదవ్ శనివారం నియామకపు ఉత్తర్వులు శనివారం జారీచేశారు. భెల్ ఎంప్లాయిస్, శేరిలింగంపల్లి యాదవ సంఘం అభివృద్ధికి పాటుపడిన ఆయన సేవలను గుర్తించి సంఘం పెద్దలు 2011లో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా, జాతీయ యువజన కోఆర్డినేటర్‌గా పదవి కట్టబెట్టారు.

కల్వర్టు పనులను పరిశీలించిన కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ సూచించారు. ఈ మేరకు మూసాపేట్ డివిజన్ పరిధి స్నేహపురి కాలనీలోని కల్వర్టు పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. వినాయక చవితిని పురస్కరించుకొని పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తి చేయాలని ఏఈ అనురాగ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వినోద్‌యాదవ్, బీజేపీ నాయకులు శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన వారిపైకేసులు

మియాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలోప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మియాపూర్ సంత సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. నాలుగు ఆటోలు, 30 ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి వారు మాత్రమే కాకుండా తోటి వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపవద్దని సూచించారు.

ఎర్రకుంట చెరువుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సర్వేనెంబరు 134లో 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రకుంట చెరువును పెన్సింగ్ చేసి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయించాలని కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్, నాయకులు బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ చెరువు చుట్టూ 2016లోనే ఫెన్సింగ్ వేశారని, కానీ కొందరు బిల్డర్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల్లో అక్రమ మార్గంలో అనుమతులు తీసుకొని మూడు భవనాలు నిర్మించారని తెలిపారు. చెరువు మరోసారి కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేసి, అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో అమలేశ్వరి, గొల్ల కృష్ణ, ఎల్ల స్వామి, అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, లెజెండ్ కాలనీవాసులు ముఖేష్, శ్రీకాంత్, జీపీఆర్ లే-అవుట్ కాలనీ వాసులు రమణారెడ్డి, గురునాథ్‌రెడ్డి, శ్యామ్ ఉన్నారు.

గోపన్‌పల్లితండాలో సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి తండాలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్థానికులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమ్యలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైపులైను, మంచినీటి వసతి, పారిశుధ్య పనులు సక్రమంగా పనిచేసేలా చూడాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రమేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు శేఖర్, మన్నే రమేష్‌రాజు, నరసింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది

నిరసనలు, ర్యాలీలు



దుండిగల్: కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల బృందం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ సర్కిల్ సాయిబాబానగర్‌లో ర్యాలీ నిర్వహించారు.

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం కూకట్‌పల్లి ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మహారాష్ట్ర బ్యాంకు నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు గుంటి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సుంకర వెంకటసత్య రవికృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు భద్రత కల్పించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ సీఈవో డా.యోబు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ముంబయి జాతీయ రహదారిపై జేఎన్‌టీయూ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విన్నుకోట శ్రీప్రకాష్, చంద్రమోహన్, రూప, జనార్ధన్‌రెడ్డి, శ్రీధర్, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

గచ్చిబౌలి: వైద్యురాలి మరణానికి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తు కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యురాలిని అత్యాచారం ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు.

● కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ కేపీహెచ్‌బీ ఇండీస్ వన్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. డా.రవికిషోర్, వన్‌సిటీ డైరెక్టర్లు నర్సింహారావు, రవిశంకర్, ఎస్ఆర్ రాణి, వికాస్, పట్టాబి, రాంకుమార్ డాక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని ఓమ్ని ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న డా.నాగవేందర్‌రావు, వైద్యులు, నర్సులు, పారామెడిక్స్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది



హైదర్‌నగర్ నిజాంపేట రోడ్డులోని హోలిస్టిక్ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే తాతా మధు, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది



రాయదుర్గం: గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హత్యాచారం, హత్యను ఖండిస్తు వైద్యులు నవీన్‌చంద్, శైలజ, అభినేయ, వినోద్, చాణిక్య కిషోర్, జగన్‌మోహన్‌రెడ్డి, శివ, యుగంధర్‌రెడ్డి, దీపక్ కోపాక, పీపీ శర్మ తదితరులు ర్యాలీ నిర్వహించారు.

● గమన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిరసన



కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా గమన్ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్, ఓపీ, శస్త్ర చికిత్సలను నిలిపివేసి వైద్యులు, సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ.. ప్రాణాలు కాపాడే వైద్యుల భద్రత ముఖ్యమన్నారు. ఆరోగ్య నిపుణులపై జరుగుతున్న హింసను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలు తేవాలన్నారు. ఆస్పత్రి డైరెక్టర్‌లు భాస్కర్‌రావు, ఇందీవర్ రెడ్డి, వైద్యులు కిషోర్ లవకుమార్‌రెడ్డి, భరత్, సిబ్బంది పాల్గొన్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి)

టెన్త్ ఆపేసిన వారికి ఐటీలో ట్రైనింగ్

హైదరాబాద్ సిటీ: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) ధార్వాడ్, ఎడ్యునెట్ ఫౌండేషన్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సర్టిఫికెట్ ప్రోగ్రాం అపూర్వ విజయం సాధించిందని ఎల్‌టీఐ మైండ్ ట్రీ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ పనీష్‌రావు అన్నారు. టెన్త్ తర్వాత చదవు ఆపేసిన యువతకు అవసరమైన ఐటీ నైపుణ్యాలను అందించడానికి, తద్వారా సాంకేతికతతో నడిచే కెరీర్‌లోకి ప్రవేశించేందుకు వీలుగా రూపొందించబడిన ఈ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌తో 80 మంది విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. డిజిటల్ ఎకానమీలో ప్రతిభావంతులను తీర్చిదిద్దుతామని ఎడ్యునెట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నగేష్‌సింగ్ తెలిపారు. ప్రాక్టికల్ శిక్షణతో 80 మంది పట్టాలను అందుకున్నారన్నారు. వారిలో చాలామంది గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను పొందడం సంతోషంగా ఉందన్నారు.

వర్షానికి చెరువును తలపిస్తున్న రోడ్డు

గాజులరామారం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువును తలపిస్తున్నాయి. గాజులరామారం డివిజన్‌లోని గాజులరామారం గ్రామ ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే గాజులరామారం హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర, రాంకీ అపార్టుమెంట్ దగ్గర రోడ్డుపై మోకాలు లోతు నీరు నిలుస్తుంది. వర్షం వచ్చినట్టుడల్లా ఇదే సమస్య తలెత్తడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఈసమస్య తలెత్తుతుందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలుపుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సైకాలజీ, సోషియాలజీ, రీసెర్చ్ మెథడాలజీ, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్, ఐసీటీ/కంప్యూటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఇంగ్లిష్‌లో బోధనలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన ఈనెల 21న సాయంత్రం 4.30 గంటలలోపు మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 9963119534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హాస్టల్స్ సిబ్బంది సమయపాలన పాటించాలి

అంబర్‌పేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎకానమికల్లి వీకర్స్ సెక్షన్(ఈడబ్ల్యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నేతలు అనిల్, కృష్ణలు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి శనివారం వినతిపత్రం అందజేశారు. అన్ని హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. చాలా మంది వార్డెన్‌లు వారానికి, నెలకు ఒకసారి హాస్టల్‌కు వస్తున్నారని ఆరోపించారు.

హాష్‌ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

10 లక్షల విలువచేసే 1291గ్రాముల ఆయిల్ స్వాధీనం

జీడిమెట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిషేధిత హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని తెలంగాణా యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. అతడి నుంచి 10 లక్షల రూపాయాల విలువచేసే 1291గ్రాముల హాష్‌ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళీ మండలం, మొంచలపేట్ గ్రామానికి చెందిన అల్లా సింహాచలం అలియాస్ సాయి, సైబు, సిద్ధార్థ(27) వృత్తి రీత్యా వెల్డర్‌గా పని చేస్తున్నాడు. చింతల్ పద్మానగర్ ఫేజ్-2లో నివాసముంటున్న సింహాచలం గత రెండు సంవత్సరాల క్రితం డ్రగ్ విక్రయిస్తున్న సురేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పాటు చేసుకున్నాడు. హరీష్, దేవా, దినేష్‌రెడ్డి, కె.పాండు, రాజా, రాములతో అనేక మంది హైద్రాబాద్ వాసులతో వ్యాపారం సాగిస్తున్నాడు. కొంత కాలం వ్యాపారం ఆపివేసిన సింహాచలం ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఆరు నెలలుగా తిరిగి డ్రగ్ దందా కొనసాగిస్తున్నాడు. ఇటీవల కాలంలో సింహాచలం చింతపల్లికి వెళ్లి 2లీటర హాష్ ఆయిల్ తీసుకువచ్చి 5ఎంఎల్ బాటిల్స్‌లో నింపి అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో టీజీఎన్యాబ్, బాలానగర్ పోలీసులు శనివారం ఉదయం సింహాచలం నివాసంపై దాడిచేసి 1291 గ్రాముల హాష్‌అయిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. డ్రగ్ విక్రయదారులను గుర్తించారు. వారిలో యూసుఫ్‌గూడకు చెందిన సిండి సాయిచరణ్ (25), అదే ప్రాంతానికి చెందిన బన్నీ ఉదయ్‌భాను(25), అమీర్‌పేట్‌కు చెందన రాపర్తి ఉదయ్(23), ఉప్పల్‌కు చెందిన పాలెం వికాస్‌నాయుడు(25)లను గుర్తించారు. ఈ సందర్భంగా డీసీపీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నారని గమనిస్తే 87126 71111, లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- చౌకగా దొరికే ఆహార పదార్థాలు హానికరం
- ఆరోగ్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యం పెరగాలి
- ఎన్‌సీడీతో 60 నుంచి 65 శాతం మంది మృతి
- డీజీహెచ్‌ఎస్ ప్రొఫెసర్ అతుల్ గోయెల్



సమావేశంలో ప్రొ.అతుల్‌గోయల్, సంగీతారెడ్డి, డాక్టర్ సునీతా నరెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) ప్రొఫెసర్ అతుల్ గోయెల్ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం నిర్వహించిన క్లినికల్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సీఐడీఎస్) సమావేశాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ గోయెల్ మాట్లాడుతూ.. చౌకగా దొరికే ఆహారంలో ఆరోగ్యానికి హాని కలిగించే షుగర్, కార్బోహైడ్రేడ్ వంటి పదార్థాలు ఉంటున్నాయని, ఇమ్యునిటీని పెంచే ఫ్రెష్ ఫుడ్, డ్రై ఫ్రూట్స్, పండ్ల ధర ఎక్కువగా ఉంటుందన్నారు. మనదేశంలో 60 నుంచి 65 శాతం మంది వరకు నాన్ కమ్యూనికల్ డీసీజ్ (ఎన్‌సీడీ) కారణంగా చనిపోతున్నారని తెలిపారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యం పెరగాలని, డయాగ్నోస్టిక్ చికిత్స విధానాలు సరళీకృతంగా ఉండాలని, పరిశోధన సంస్థలు వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ఐసీయూల్లో చికిత్స పొందుతున్న రోగుల్లో కొందరు ఇన్‌ఫెక్షన్ కారణంగా చనిపోతున్నట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో అపోలో ఆస్పత్రుల ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్ లాంటి ఉపద్రవాలు వస్తే తట్టుకొని నిలబడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సర్వేలెన్స్ విధానాన్ని బలోపేతం చేయాలని, భవిష్యత్‌లో వచ్చే రోగాలను ముందుగానే గుర్తించే విధానం రావాలన్నారు. క్లినికల్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సీఐడీఎస్) అధ్యక్షుడు డాక్టర్ జార్జ్ ఎం వర్గీస్, సిడ్‌స్కాన్, ఆర్గనైజింగ్ చైర్ డాక్టర్ సునీతనరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చేవిగా రెండు క్లిష్టమైన సవాళ్లు ఉన్నాయన్నారు. అవి యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్), ఎమర్జింగ్ ఇన్ఫెక్షన్లు అన్నారు. రోగ నిర్ధారణ, కొత్త యాంటీబయాటిక్‌లను అభివృద్ధి చేయడానికి పరిశోధన అత్యవసరమన్నారు. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య సహకారాన్ని పెంచాల్సిన అవసరముందన్నారు. ఆస్పత్రులు, కమ్యూనిటీలలో ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ చర్యలను బలోపేతం చేయడం కీలకమన్నారు. అంటువ్యాధులను నివారించడానికి అంటువ్యాధి నిపుణులు, ఎపిడెమియాలజిస్టులు, పశువైద్యులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రజారోగ్య అధికారులతో సహ బహుళ విభాగాలలో సహకారం అవసరం ఉందన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించడానికి ఇంటర్ డిసిప్లినరీ సహకారాల ఏర్పాటుకు సీఐడీఎస్ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐడీఎస్ సెక్రటరీ డాక్టర్ వసంత్ నాగ్వేకర్, సీఐడీఎస్ కోశాధికారి డాక్టర్ అశ్విని తయాడే, సిడ్‌స్కాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వెంకట్ రమేష్, సిడ్‌స్కాన్ సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఓసీ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- యువతికి తీవ్రగాయాలు
- నగరం నుంచి పాడేరు ఏజెన్సీ చూసేందుకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

అనకాపల్లిటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. అటవీ ప్రాంతంలోని పర్యాటక స్థలాల సందర్శనకు హైదరాబాద్ నుంచి పాడేరు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఒకరు శుక్రవారం రాత్రి అనకాపల్లి బైపాస్ జంక్షన్‌కు సమీపంలో ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మృతి చెందారు. మరో యువతి తీవ్రంగా గాయపడింది. అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పి.షైడపు నాయుడు కథనం మేరకు.. నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్న ఏడుగురు శుక్రవారం విశాఖకు వెళ్లారు. వారిలో ఐదుగురు రెండు ద్విచక్ర వాహనాలను అద్దెకు తీసుకుని ఒక వాహనంపై ఇద్దరు, మరో వాహనంపై ముగ్గురు అల్లూరి జిల్లా పాడేరు సమీపాన గల వంజంగి పర్యాటక ప్రాంతాన్ని చూసేందుకు బయలుదేరారు. పాడేరు వెళ్లే దారి తెలియక జాతీయ రహదారిపై అనకాపల్లి బైపాస్ జంక్షన్ వరకూ వచ్చేశారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చందానగర్‌కు చెందిన పురాలశెట్టి శరత్‌కుమార్(24), ములుగు జిల్లాకు చెందిన యువతి పాడేరుకు వెళ్లే మార్గాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఆ విషయాన్ని తమకంటే ముందు వెళుతున్న ముగ్గురికి సమాచారం అందించారు. అక్కడున్న వంతెన పైనుంచి సర్వీస్ రోడ్డులోకి రావాలని చెప్పి ఇద్దరూ అక్కడ వేచి ఉన్నారు. అదే సమయంలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆ ముగ్గురినీ తప్పించబోయి సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న శరత్‌కుమార్‌ను, యువతిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువతి తీవ్రంగా గాయపడడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గీత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి ఫయాజుద్దీన్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్‌లోని ఊర చెరువు ప్రాంతంలో కొంపల్లిగౌడ సంఘం ఆధ్వర్యంలో ఈత చెట్లను నాటేందుకు ఆయన, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య, పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ కలిసి నాటారు.

భవిష్యత్ తరాలకు ఆస్తి కాదు.. ఆరోగ్యం అందించాలి

చందానగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో ఆస్తులకన్న ఆరోగ్యమే ముఖ్యమని ప్రకృతి, సహజసిద్ధమైన వాతావరణం ముఖ్యమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ రాజేంద్రనగర్‌రెడ్డి సమీపంలోని మీదికుంట చెరువు సుందరీకరణలో భాగంగా ఫెనామో పిపుల్‌ఐటీ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా భైరి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో చెరువు సుందరీకరణ పూర్తి



లేక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కంపెనీ ప్రతినిధులు

చేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమం భక్షికుంట లేక్‌వ్యూ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లేక్‌వ్యూ కమిషనర్ శివకుమార్‌నాయుడు ఫెనామో సహ వ్యవస్థాపకులు భైరిరెడ్డి, సీఓఓ హరిభైరెడ్డి, లేక్‌వ్యూ ఆఫ్ ఇండియా ఆనంద్, కార్పొరేటర్ మంజులారెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు.

నియోకవర్గ అభివృద్ధికి సహకరించాలి

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును శనివారం ఆయన నివాసంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కలిశారు. అభివృద్ధి నిధులు త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు గాంధీ తెలిపారు.